# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 7 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 19 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




రూ. 10,500 కోట్లతో

## ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు

**జపాన్ పర్యటనలో భారీ పెట్టుబడుల సాధన**

**సీఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఒప్పందం**


**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌టీటీ- డేటా, నెయిసా సంస్థలు సంయుక్తంగా ఈ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలపై ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. మరోవైపు రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలకు ఈ ఒప్పందం జరిగింది. రుద్రారంలో ఇప్పటికే ఈ సంస్థ రెండు ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది. ఈ భారీ పెట్టుబడులపై సీఎం రేవంత్ హర్షం ..మిగతా 2లో

### హైవేలపై టోల్ ప్లాజాలు


# తొలగింపు

**కొత్త విధానంతో మీ డబ్బు, సమయం రెండూ ఆదా!**

**టోల్‌ప్లాజా, ఫాస్టాగ్ కథ కంచికి- ఇక కొత్త విధానంలో టోల్ వసూళ్లు!**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** దేశంలోని ఫోర్ వే, సిక్స్ వే, ఎక్స్‌ప్రెస్ వే ఎక్కడా ఆగే పనిలేకుండా, ట్రాఫిక్ అవాంతరాల్లేకుండా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో రోడ్ల అభివృద్ధి చకచకా సాగిపోతోంది. విశాలమైన రోడ్లపై బ్రేకుల్లేకుండా ప్రయాణం సాగిపోయే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు భారత ప్రభుత్వం దేశంలో హైవే నిర్మాణ వేగాన్ని రోజుకు 100 కిలోమీటర్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాబోయే 18 నెలల్లో భారతదేశంలో రహదారి మౌలిక సదుపాయాలు అమెరికా కంటే మెరుగ్గా మారుతాయని అన్నారు. పీటీఐ నివేదిక ప్రకారం.. భారత రహదారుల మంత్రిత్వ శాఖ రానున్న సంవత్సరాల్లో 25,000km రెండు, నాలుగు లేన్ల రహదారులను నిర్మిస్తుందని కూడా నితిన్ గడ్కరీ చెప్పారు. భారత్‌కు మౌలిక సదుపాయాల అభివృద్ధి చాలా ముఖ్యమని, ఇందుకోసం దేశంలో హైవే నిర్మాణ వేగాన్ని రోజుకు 100km పెంచే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మాట్లాడిన ఆయన ఇందుకు తగినంతగా నిధులు సమకూరినట్లు, ఈ హైవే ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని అన్నారు. 2020-21లో దేశంలో హైవే నిర్మాణ వేగం రోజుకు రికార్డు స్థాయిలో 37kmకు చేరుకుందని నివేదిక పేర్కొంది. 2019-20లో 10,237km, 2020-21లో 13,435 km, 2021-22లో 10,457km, ..మిగతా 2లో



### స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** పదోన్నతులు, బదిలీలతోపాటు నియామకాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన స్కూలు అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఎస్జీటీలకు పదోన్నతులు ద్వారా ఎంత నిష్పత్తిలో స్కూలు అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయమని తేల్చి చెప్పింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు, ప్రత్యక్ష నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ కె.కిరణ్ కుమార్ మరో 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# మజ్లిస్ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్



**మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా**

**ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ- చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ- చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు ..మిగతా 2లో




బంగ్లా మైనార్టీ హిందువులను

### రక్షించండి

**యూనస్ వ్యాఖ్యలకు భారత్ ధీటుగా జవాబు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టం తో నెలకొన్న హింసపై బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ స్పందించిన తీరుపై భారత్ ఘాటుగా సమాధానం చెప్పింది. గత వారం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో ముగ్గురు మరణించగా, వందలాది మంది గాయపడిన మైనారిటీ ముస్లిం వర్గాలను రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యూనస్ కోరారు. ఇక, ..మిగతా 2లో

### భగవద్గీత, నాట్య శాస్త్రానికి

## యునెస్కో గుర్తింపు


**యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భగవద్గీత, నాట్య శాస్త్రానికి చోటు**


**ఈ విషయంపై ఎక్స్ వేదికగా స్పందించిన పవన్ కళ్యాణ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** భారతీయ సంస్కృతికి అద్దంపట్టే భగవద్గీతతోపాటు భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. అత్యుత్తమ విలువ కలిగిన డాక్యుమెంటరీని సంరక్షించేందుకు ఇది దోహదం చేస్తుంది. ఈనెల 17న కొత్తగా 74 డాక్యుమెంటరీలు యునెస్కో మెమోరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చేరాయి. ఫలితంగా మొత్తం సంఖ్య 570కి చేరింది. మరోవైపు ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి.

**భగవద్గీతను మించింది లేదు**

మహాభారతంలో యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు ..మిగతా 2లో





## మహిళాశక్తే తెలంగాణను నడిపిస్తది



- తెలంగాణ అస్తిత్వ పతాకను శాశ్వతంగా నిలుపుదాం: కేసీఆర్
- మహిళలకు మనమే అస్త్రశస్త్రాలను అందించాలె
- వారిలో నాయకత్వ పటిమను పెంపొందించాలె
- రేపటి కోసం మహిళా సమాజాన్ని సన్నద్ధం చెయ్యాలె
- ఇది రాజకీయ పార్టీగా బీఆర్ఎస్‌పై గురుతర బాధ్యత
- ప్రతి మహిళలో తెలంగాణ భావనను పాదుకొల్పాలె
- అప్పుడే తెలంగాణ శ్రేయస్కరంగా, సుభిక్షంగా ఉంటది
- అన్ని వర్గాల మహిళలను భాగస్వామ్యం చెయ్యాలె
- వచ్చే నెలలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తం
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

2




## హైవేలపై టోల్ ప్లాజాలు తొలగింపు

**మొదటి పేజీ తరువాయి...**

2022-23లో 10,331km, 2023-24లో 12,349%ఎ% నిర్మించాలని రహదారుల మంత్రిత్వ శాఖ అంచనా వేసినట్లు వెల్లడించింది.

టోల్ ప్లాజాకు త్వరలో రాంరాం: దీనితో పాటు భారత ప్రభుత్వం చాలా కాలంగా దేశవ్యాప్తంగా శాటిలైట్ ఆధారిత టోల్ వసూలును అమలు చేయాలనే ప్రణాళికను పరిశీలిస్తోంది. ఈ సిస్టమ్ ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను భర్తీ చేస్తుంది. దీనిపై నితిన్ గడ్కరీ మాట్లాడుతూ త్వరలో దేశవ్యాప్తంగా భౌతిక టోల్ బూత్‌లను తొలగించి మే 1, 2025 నుంచి కొత్త టోల్ విధానాన్ని తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. దీంతో ఎక్కడా ఆగే పనిలేకుండా మీ ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, వేగంగా ఉండబోతోంది. "కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త టోల్ విధానాన్ని ప్రవేశపెడుతుంది. దాని గురించి నేను ఇప్పుడే పెద్దగా చెప్పను, కానీ రాబోయే 15 రోజుల్లో కొత్త విధానాన్ని ప్రకటిస్తాం. ఈ కొత్త పాలసీని ఒకసారి అమలు చేసిన తర్వాత టోల్ గురించి ఎవరూ ఫిర్యాదు చేయడానికి ఎటువంటి కారణం ఉండదు" అని గడ్కరీ అన్నారు. ఈ క్రమంలో మాట్లాడిన ఆయన చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ముంబయి-గోవా హైవే కూడా ఈ ఏడాది జూన్ నాటికి పూర్తవుతుందని తెలిపారు.

ఇకపోతే ఈ కొత్త వ్యవస్థలో శాటిలైట్ ట్రాకింగ్, వాహనాల నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ ఆధారంగా బ్యాంకు ఖాతాల నుంచి ఆటోమేటిక్ టోల్ వసూలు ఉంటుంది. ఇది మాన్యువల్ టోల్ వసూలు అవసరాన్ని తొలగిస్తుంది. దీంతో ఇకపై టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన పనిలేదు. ఫలితంగా ట్రాఫిక్ రద్దీ కూడా తగ్గుతుంది. దీనివల్ల మీ సమయం, డబ్బు రెండూ ఆదా అవుతుంది.

ఈ పాలసీ ప్రకారం వార్షిక టోల్ పాస్, కిలోమీటర్ ఆధారిత పన్ను విధానం అమలు చేయనున్నారు. ఇది జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై అధిక టోల్ ఛార్జీల నుంచి లక్షలాది మంది వాహనదారులకు ఉపశమనం కలిగించనుంది

## మజ్లిస్ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్

**మొదటి పేజీ తరువాయి...**



చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించక పోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతోనే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ- చేస్తోందని చెప్పారు. మాకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని.. హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మతోన్మాదం, గూండాయిజాన్ని ఎదుర్కొంటూ బీజేపీ ధర్మయుద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీ-లో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారు. కానీ అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువ ఉందో అక్కడే పనులు జరిగాయని ఆరోపించారు. ఇరు-కై-న రోడ్లు సైతం నిర్మించారన్నారు. జీహెచ్ఎంసీ స్థితి దారుణంగా మారిందని.. వీధిలైట్లు- కొనడానికి డబ్బుల్లేని స్థితికి దిగజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు అసమర్థంగా ఉందని.. పౌర సేవల మెరుగుదలకు నిధులు సైతం పెరగడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ నుంచి నగరాన్ని రక్షించాలంటే.. చైతన్యంతో ఓటు-వేయాలని ప్రజలకు ఆయన సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టు-బడుల గురించి చెబుతున్నారు..కానీ అవి ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక, పన్నుల సంస్కరణలు ఉగ్రవాదం, మతోన్మాదాన్ని అరికట్టడంతోపాటు- సమర్థవంతమైన విదేశాంగ విధానం.. ఇలా అన్నింటిలో ప్రగతి కనిపిస్తోందని చెప్పారు. గతంలో విద్యుత్ కోసం రైతులు మోటార్ల దగ్గర నిద్రించాల్సి వచ్చేదని..మోదీ పాలనలో విద్యుత్ కోతల్లేని దేశంగా మారిందన్నారు. సనత్ నగర్,మల్కాజ్‌గిరి,దిల్‌సుఖ్‌నగర్, గౌలిపుర,చార్మినార్,నాంపల్లి, సోమాజిగూడ, ఖైరతాబాద్,కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గౌతం రావు గారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మజ్లిస్ పార్టీ ఇప్పుడేం ఓల్డ్ సిటీ-కి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తూ కుట్రలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు.

## బంగ్లా మైనార్టీ హిందువులను రక్షించండి

**మొదటి పేజీ తరువాయి...**

బంగ్లాదేశ్ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కంటే, తమ దేశంలోని మైనారిటీల హక్కులను కాపాడు కోవడంపై దృష్టి పెట్టాలని చురకలు అంటించాడు. బంగ్లాదేశ్ మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న హింస నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఇక, గత సంవత్సరం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీచ్యుతులైనప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి గందరగోళంగా ఉంది. బంగ్లాలో మైనార్టులుగా ఉన్న హిందువులపై తీవ్రవాద ఇస్లామిస్టులు అనేకసార్లు దాడులకు పాల్పడ్డారు. దాదాపు 200 దేవాలయాలను ధ్వంసం చేయగా.. పూజారులను అరెస్టు చేశారు.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసించారనే ఆరోపణలను బంగ్లాదేశ్ తరచుగా ఖండించింది.

# భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు

**మొదటి పేజీ తరువాయి...**

చేసిన బోధ- భగవద్గీత. ఇందులో మొత్తం 18 అధ్యాయాలు ఉన్నాయి. మానవులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే తెన్నూ రెండింటినీ శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు. ప్రపంచంలో ఆనాటి నుంచి ఈనాటి వరకు, ఎప్పటికీ భగవద్గీతను మించిన వ్యక్తిత్వ వికాస సారస్వతం మరోటి లేదని పాశ్చాత్యులు కూడా అంగీకరిస్తున్నారు.

### గర్వించే విషయమన్న ప్రధాని మోడీ

భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. శ్రీకృష్ణుడి బోధించిన భగవద్గీతతో పాటు భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించు కున్నాయని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ- భగవద్గీత.




ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ క్షణం. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## మహిళాశక్తే తెలంగాణను నడిపిస్తది

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** రేపటి తెలంగాణ కోసం మహిళా నాయకత్వాన్ని సిద్ధం చేద్దామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. మహిళల్లో నాయకత్వ పటిమను పెంపొందించి.. తెలంగాణ భవిష్యత్తు తరాలు సుభిక్షంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకునే గురుతర పాత్ర పోషించేందుకు బీఆర్ఎస్ సిద్ధం కావాలని చెప్పారు. ఇంటర్ విద్యార్థిని స్థాయి నుంచి సమాజంలోని అన్ని రంగాలు, అన్నివర్గాలకు చెందిన మహిళలతో వచ్చే నెలలో తెలంగాణ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎలతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ సభ తర్వాత రాష్ట్రంలోని విద్యార్థులు, వివిధ రంగాల మహిళలను సమీకరించి వారిలో సమరశీలత, చైతన్యాన్ని పాదుకొల్పి తద్వారా తెలంగాణలో శాశ్వత మహిళాశక్తిని రూపొందించేందుకు తెలంగాణ భవన్ వేదిక కాబోతున్నదని చెప్పారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కోసం మహిళలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. మహిళల మనసులో తెలంగాణ భావనను పాదుకొల్పితే ఆ భావన కుటుంబానికి, సమాజానికి వ్యాపిస్తుందని, అది తరతరాలు తెలంగాణను సుభిక్షంగా, శ్రేయస్కరంగా ఉంచుతుందని ఆకాంక్షించారు. ఎల్కతుర్తి సభలో మహిళల కోసం చేయాల్సిన ప్రత్యేక ఏర్పాట్లు, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ముఖ్యనాయకులతో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో మహిళా ప్రతినిధులతో కేసీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాసర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్ కుమార్, జీవన్‌రెడ్డి, చంద్రావతి, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, టీఎస్పీఎస్ మాజీ సభ్యుడు సుమిత్రానంద తనోబా, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీ సాయిచంద్, పార్టీ సీనియర్ నేత కల్వకుంట్ల వంశీధర్‌రావు, జాగృతి నేతలు నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళాభ్యుదయానికి పార్టీ పరంగా చేపట్టబోయే కార్యాచరణపై ఎమ్మెల్సీ కవిత సారథ్యంలోని మహిళా బృందానికి పార్టీ అధినేత కేసీఆర్ పలు సూచనలు చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై తీసుకోవాల్సిన చర్యలను ఉద్బోధించారు. తెలంగాణ భవిష్యత్తు రాజకీయ అవసరాలకు మహిళా శక్తిని సన్నద్ధం చేయాలని చెప్పారు.

### సమాజానికి మహిళే కేంద్రం

సమాజానికి మహిళే మూలకేంద్రమని కేసీఆర్ స్పష్టంచేశారు. ఇంటిని నడిపే మహిళకు సమాజాన్ని నడిపే శక్తి ఉంటుందని చెప్పారు. అటువంటి మహిళలు సమాజసేవలో, రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అంకాపూర్, ముక్రా(కే) వంటి గ్రామాలు మహిళల చేతిలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఉదంతాలు కండ్లముందున్నాయని, పార్టీ నాయకత్వం అందించిన పదవులతో మహిళలు రాజకీయాల్లో రాణించి ఆదర్శంగా నిలిచిన సందర్భాలను ఉదహరించారు.

### మహిళల్లో తెలంగాణ భావన పాదుకొల్పాలి

ఎవరికి ఇష్టమున్నా, లేకున్నా భవిష్యత్తు రాజకీయాల్లో మహిళా శక్తి పెరగటం అనివార్య పరిణామమని కేసీఆర్ తేల్చిచెప్పారు. 'ఒకప్పుడు మహిళల్లో అక్షరాస్యత శాతం తక్కువ ఉండేది. కానీ, పరిస్థితులు మారిపోయినయి. మహిళలు విద్యతో పాటు అన్ని రంగాల్లో వారి శక్తిని చాటుకుంటున్నరు. వారిలో స్వావలంబన పెరిగింది. స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే వాతావరణం ఏర్పడుతున్నది. ఇలాంటి తరుణంలో మరింత చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తరు' అని తెలిపారు. 'భవిష్యత్తు రాజకీయ అవసరాలకు మహిళా శక్తిని సన్నద్ధం చేయటమే కాదు.. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ మహిళల చేతిలోనే సురక్షితంగా ఉంటుంది' అని స్పష్టం చేశారు.

### వచ్చే నెలలో విస్తృతస్థాయి సమావేశం

ఇంటర్ స్థాయి నుంచి విద్యార్థినులు, ప్రస్తుత, రిటైర్డ్ ఉద్యోగులు, మహిళా సాహితీవేత్తలు, క్రీడాకారులు సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను భాగస్వాములను చేసేందుకు వచ్చేనెల (మే)లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని కేసీఆర్ వెల్లడించారు. ఎమ్మెల్సీ కవిత సారథ్యంలోని మహిళా ప్రతినిధి బృందం కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఐదారు బృందాలుగా కోర్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.




## రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పెట్టు-బడులు వస్తున్నాయి. తెలంగాణలో సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తోంది. నిపుణులు ఉన్నందున ఏఐ డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌టీటి భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం సుస్థిరంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ- డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిలో విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ-, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ- డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది.

## టీటీడీ గోశాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దు

**టీటీడీ గోశాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దు**

**హైడ్రామా సృష్టించి భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు**

**కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్‌దే పెత్తనంలా మారింది**

**అమరావతి, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం):** తాను చేతులెత్తి జోడిస్తున్నా అని, టీటీడీ గోశాలను ఎవరూ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. హైడ్రామా సృష్టించి భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని, టీటీడీపై రాద్ధాంతం మానుకోండన్నారు. రాజకీయ రాద్ధాంతం జరిగితే టీటీడీ ప్రతిష్ట దిగజారే అవకాశం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానని, న్యాయవ్యవస్థను ధ్వంసం చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు. తిరుపతిలో టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై వైసీపీ, కూటమి నేతల మధ్య రాజకీయ దుమారం రేగింది. ఈ వివాదంపై నారాయణ స్పందించారు. 'అందరికి చేతులెత్తి జోడిస్తున్నాను, గోశాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దు. హైడ్రామా సృష్టించి భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు. టీటీడీపై రాద్ధాంతం మానుకోండి. రాజకీయ రాద్ధాంతం జరిగితే టీటీడీ ప్రతిష్ట దిగజారే అవకాశం ఉంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. 'ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను ఖండిస్తున్నా. న్యాయవ్యవస్థను ధ్వంసం చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. ఆర్ఎస్ఎస్ వ్యక్తులను గవర్నర్‌లుగా చేసి రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్‌దే పెత్తనంలా మారింది. గవర్నర్‌ల నిర్ణయాలపై పలు రాష్ట్రాల సీఎంలు కోర్టును ఆశ్రయించారు. గవర్నర్ల నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. సుప్రీంకోర్టు తీర్పును ఉపరాష్ట్రపతి ఆక్షేపించడం సరైన పద్ధతి కాదు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఫీజు రీయింబర్స్ ఆలస్యం ప్రభుత్వ క్రిమినల్ చర్యగా భావించాలి. లక్షల మంది విద్యార్థుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.



# పర్యావరణ పరిరక్షణ, మానవ రహిత
# వ్యవసాయం దిశగా పరిశోధనలు సాగాలి

### వ్యవసాయ వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

బుద్వేల్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం శుక్రవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం సెమినార్ హాల్లో జరిగింది. వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సంస్థలు, వ్యవస్థలు మారాలని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు. అధునాతన సవాళ్లను ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మం డలి ఎప్పటికప్పుడు పనర్వ్యవస్థీకరణ చర్యలు చేపడుతుందని, అదే విదంగా తాను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆనంతరం విశ్వవిద్యాలయంలో మార్పులకు శ్రీకారం చుట్టానని తెలపారు. ఒకప్పుడు ఆహార భద్రత కోసం అధిక దిగుబడి విధానాలు అవలంబించామన్నారు. అందుకోసం నీటి ప్రాజెక్టులు నిర్మించి ఎరువల ప్యాక్టరీలు విరివిగా స్థాపించామన్నారు. అందువల్ల నేడు అన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. 1947–50 ల మధ్య కాలంలో దేశం సాదించిన దిగుబడులు నేడు తెలంగాణ ఒకటే సాదిస్తుందన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి పెరుగుదల కారణంగా నేడు కొత్త సవాళ్ళ ఎదురౌతున్నాయన్నారు. సహజ వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ పద్దతులు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్లు, రోబోటిక్ టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆ దిశగా పరిశోధనలు కూడా సాగాలన్నారు. అదే విదంగా ప్రకృతి పరిరక్షణకు అనువైన విధానాన్ని తీసుకురావాలన్నారు. దేశవాళీ వండగాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇద్దరు ముగ్గురు రైతులకు విశ్వవిద్యాలయం తరపున నాణ్యమైన విత్తనాలు అందించనున్నమన్నారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం రానున్నదన్నారు. రాష్ట్రంలో అధిక ఆహార ఉ త్పత్తులన్ని ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలన్ని అందిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలను తీసుకుంటుందని, ఈ అంశంలో విశ్వవిద్యాలయం నాలెడ్జ్ బాగస్వామిగా ఉండనున్నదన్నారు. రాష్ట్రం నుంచి ప్రతి ఏటా సుమారు 20వేల కోట్ల రూపాయల విలువ గల బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని, కానీ అం దుకు కావాల్సిన అవసరమైన వనరులు లేవన్నారు. ఆహార ఉత్పత్తులకు విలువ జోడింపుకు అవసరమైన పరిశోదనలపై దృష్టి పెట్టాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సూచిం చారు. పరిశోధన, విస్తరణలకు సంబంధించి 2022 2023, 2023–2024 నివేదికలను పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం. యాఖాద్రీ సమావేశాలలో వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉప కులపతి అల్దాస్ జానయ్య ఇతర అధికారులతో కలసి విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం వివిధ అం శాలపై రూపొందించిన సీడీ లను విడుదల చేశారు. రిజిస్ట్రార్ డాకర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ వందన సమర్పణ చేశారు.


సలహా మండలి సమావేశాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య


ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య


# నేడు ఎన్ఐఆర్ డిపీఆర్‌కు పార్లమెంటు సభ్యుల బృందం రాక

### ఉద్యోగులతో సమావేశం కానున్న పార్లమెంట్ సభ్యులు

బుద్వేల్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పథకాలు ఏ విధంగా అమల వుతున్నాయో తెలుసుకోవడానికి రాష్ట్రానికి వస్తున్న 11 మంది పార్లమెంటు సభ్యుల బృందం శనివారం రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ ఉద్యోగులతో సమావేశం కారున్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ ఉద్యోగులకు ఏప్రిల్ నెల నుంచి బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో వారు ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టికి, గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ దృష్టికి, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రపతికి పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా తమ ఆవేదనను తెలియజేశారు. ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ కు బడ్జెట్ కేటాయింపులు లేకపోతే ఉద్యోగుల పరిస్థితి ఏంటి అంటూ వారు ప్రశ్నించారు. దీంతో స్పందించిన కేంద్ర ప్రభుత్వం శనివారం 11 మంది పార్లమెంటు సభ్యుల బృందం ను ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ కు పంపిస్తుంది. వారు ఉద్యోగులతో చర్చించి ఉద్యోగులు చెబుతున్న విషయాలను, ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి, ప్రధానమంత్రి దృష్టికి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళనున్నారు.



జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ



# రాజేంద్రనగర్‌లో వర్షం

బుద్వేల్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ లో శుక్రవారం సాయంత్రం జోరు వాన కురిసింది. ఈదురు గాలులతో వర్షం కురువడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షానికి బస్తీలలో ఉన్న పలు రహదారులు చెరువులను తలపించాయి. బుద్వేల్ కుసుమ హరనాథ బాబా మందిరం ముందు వర్షం నీరు నిలచింది. బుద్వేల్ సాయిక్రిష్ణ కాలనీ ఎస్ఎన్ఆర్ చౌరస్తా నుంచి గేట్ వే స్కూల్ కు వెళ్లే దారిలో సైతం రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉప్పర్పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద రోడ్డుపై అర గంట సేపు వర్షం నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా రెం డు గంటల పాటు కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



# నేడు విద్యుత్ సరఫరా లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం) మైలర్ దేవుపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమత్రా నిమిత్తం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు రిసెప్షన్ పరిధిలోని పల్లె చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు పల్లె చెరువు ప్రాంతం, ఎండి పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:00 నుండి 45 వరకు , బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుండి 9:45 వరకు అయిషా కాలనీ, కింగ్స్ ఎవెన్యూ, యూసఫ్ గుల్షన్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

**హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మలమూత్ర నిమిత్తం శనివారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు పి అండ్ టి కాలనీ, ఏబిసిడి, స్పెషల్ బ్లాక్స్, కీర్తి రిచ్మండ్ విల్లాస్, ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు గంధం గూడ విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి కాలనీ, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధం గూడ గృహాలు, మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పి అండ్ టి కాలనీ, ఏబిసిడి, స్పెషల్ బ్లాక్, మ్యాపులే టౌన్, విశ్వాస్ టౌన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.

**కిస్మత్ పూర్ లో...**

కిస్మత్పూర్ లో గల చర్చి విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేందర్ కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2,4, సిఎల్ విల్లా, పూజా విల్లాస్, కృతి విల్లాస్ ప్రాంతాలలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, విద్యాపీఠం ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సరస్వతి పీఠం, భవాని కాలనీ, సిరి ఎంక్లేవ్, శ్రీనివాస ఎంక్లేవ్, ధాత్రి లేఔట్, ఆనంద నగర్, కృష్ణానగర్, శివాజీ యూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగిర్, పోచమ్మ టెంపుల్, వికాస్ నగర్ ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.






# అకారణంగా ఓ యువకునిపై
# ముగ్గురు యువకులు దాడి

బుద్వేల్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ నౌనెంబర్, సిక్ చావుని ప్రాంతంలో ఐస్ క్రీమ్ బండిపై ఐస్ క్రీమ్ విక్రయాలు చేసే అనూజ్ (23) పై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై అత్తాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్ కు చెందిన అనూజ్ బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి సిక్ చావుని లో అద్దెకు ఉంటున్నాడు. ఈ నెల 14న ఆర్ష మహల్ ఫాకీజా హెటల్ వద్ద ఐస్ క్రీమ్ బండిని ఆపిన అనూజ్ పాన్ షాప్ కు వెళ్లి బీడీలు కొనుగోలు చేసి వస్తుండగా, అనూజ్ దగ్గర ఉన్న సెల్ ఫోన్ ను తక్కువ ధరకే విక్రయించాలని అక్కడ కూర్చున్న సిక్ చావుని, నౌనెంబర్ ప్రాం తానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్(20), హుడా కాలనీ కి చెందిన సల్మాన్ ఖాన్(20), కొంగరి క్రాంతి అలియాస్ నివాస్ (23)లు కోరారు. దానికి అనూజ్ నిరాకరించడంతో చంపేస్తామని బెదిరించారు . కత్తితో తలపై గాయపరిచారు. భయానికి అనూజ్ పక్కనే ఉన్న రాధాక్రిష్ణ జూవెలరీస్ షాప్ లోకి పరిగెత్తాడు. అయినా వదలకుండ అనూజ్ పై దాడి చేశారు. దీంతో అనూజ్ విషయాన్ని తన అన్న మోహిత్ కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహ్మద్ అఫ్రోజ్, సల్మాన్ ఖాన్, కొంగరి క్రాంతి అలియాస్ నివాస్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.


ఓ యువకుని పై దాడి చేసిన కేసులో అరెస్టు అయిన యువకులు



బిఆర్ఎస్ పార్టీ సన్నహక సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ కురుమ.

# బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహొత్సవానికి వేలాదిగా తరలి వెళ్తాం

### మైలార్ దేవుపల్లి బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ కురుమ



రాజేంద్రనగర్: ఏప్రిల్ 17 ( ప్రభాత ఉదయం) ఈనెల 27న జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జ్ పి.కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా హాజరై విజయవంతం చేస్తామని మైలార్ధేవపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ తెలిపారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ డివిజన్ సన్న హక సమావేశంలో వెంకటేష్ కురుమ మాట్లాడుతూ..... ఈనెల 27 వరంగల్ ఎల్కతుర్తి లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహొత్సవానికి మైనార్దేపల్లి డివిజన్ నుంచి వేలాదిగా తరలి వెళ్ళనున్నట్లు తెలిపారు. నేటి నుంచి బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి ఈ సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అరాచక కాంగ్రెస్ పాల నుంచి విముక్తి లభించి తెలంగాణలో మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ బాధ్యులు పి. కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ప్రధానంగా మైలార్దేవపల్లి నుంచి వేలాదిగా సభకు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే మరోసారి కేసీఆర్‌కి అవకాశమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ వాటిని అమలు చేయక ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ రాష్ట్రాన్ని నిజంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల పల్లెలకూ నల్ల నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే నేత కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తూ... ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నోముల రాము యాదవ్, యూత్ అధ్యక్షులు అక్యం రఘు రాజేష్ యాదవ్ సోమ శ్రీనివాస్, గుప్తా మైసి రెడ్డి ఉప్పల్ శ్రీను సూర్యం, అరుణ్ ముదిరాజ్, రాజు దుర్గేష్ భగవాన్ దాస్ క్రాంతి వెంకట్ రమణ, బాల్ రాజు, అశోక్ కుమార్,సోమ సందీప్ గుప్తా కార్తీక్ ముదిరాజ్, మంచర్ల చిరంజీవి, కొంపల్లి జగదీష్, ఈశ్వర్, ఏషాల వెంకటేష్, సుధీర్ కుమార్, నాగరాజ్, నరేష్ యాదవ్, భాస్కర్ భూదేవి అరుణ రెడ్డి ఉమ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మైలార్ దేవుపల్లి డివిజన్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్

# ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి : ఎస్ వెంకటేశ్

బుద్వేల్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం) : ఈనెల 27న వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మైలార్ దేవుపల్లి డివిజన్ నుంచి వందలాదిమంది కార్యకర్తలతో తదర వెళ్లనున్నట్లు బీ ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాబుల్ రెడ్డినగర్ లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం బీ ఆర్ ఎస్ ఇంచార్జి పి కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ సభ కు పోటీపడి వస్తాం అన్నారు . తెలంగాణ యువతతో పాటు ప్రజలు మైలార్ దేవ్ పల్లి డివిజన్ నుండి పెద్ద ఎత్తున బి ఆర్ ఎస్ పార్టీ రజత్వోత్సవ సభకు బయలుదేరుతున్నట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలుతెలంగాణలో మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలని ప్రజలు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారని మైలార్దేవ్పల్లి డివిజన్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే మరోసారి కేసీఆర్‌కి అవకాశమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే తెలంగాణ రజతోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, కానీ వాటిని అమలు చేయక ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ రాష్ట్రాన్ని నిజంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల పల్లెలకూ నల్ల నీటిని అందించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే నేత కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా అధికారంలో ఉన్నా ప్రజల నిత్యజీవిత సమస్యలపై దృష్టిపెట్టలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నోముల రాము యాదవ్, రాజేష్ యాదవ్ సోమ శ్రీనివాస్, గుప్తా మైసి రెడ్డి ఉప్పల్ శ్రీను సూర్యం, అరుణ్ ముదిరాజ్, రాజు దుర్గేష్ భగవాన్ దాస్ క్రాంతి వెంకట్ రమణబాల్ రాజు అశోక్ కుమార్, సోమ సందీప్ గుప్తా , కార్తీక్ ముదిరాజ్, మంచర్ల చిరంజీవి, కొంపల్లి జగదీష్, ఈశ్వర్, ఏషాల వెంకటేష్, సుధీర్ కుమార్, నాగరాజ్, నరేష్ యాదవ్, భాస్కర్ భూదేవి అరుణ రెడ్డి ఉమ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# ఈ నెల 21 నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సభలు

బుద్వేల్,ఏప్రిల్18(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మండలాలు, డివిజన్లలో నిర్వహించనున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశాలను జయప్రదం చేయడానికి ముఖ్య నాయకులందరు సహకరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కోరారు. శుక్రవారం మైలార్దేవుపల్లిలోని తన నివాసంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని గుర్తు చేశారు. ఆ కార్యక్రమాలను నియోజకవర్గంలో అన్ని ప్రధాన ప్రాంతాలలో పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్యచరణ తో ము ందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. అందరు నాయకులు కలసి కట్టుగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.దనుంజయ, టి.ప్రేంగౌడ్, వి.శ్రీనివాస్ గుప్తా. సరికొండ వెంకటేశ్, జీవన్ గౌడ్, పచ్చ శ్రీనివాస్, షేక్ ఫరీద్, గోల్కొండ రాజ్ కుమార్, సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి పోతులపల్లి సవ్య శ్రీ , పోతులపల్లి అనీల్ సాగర్ దంపతుల కుమారుడు పోతులపల్లి అద్విక్ సాగర్ జ్ఞాపకార్థం 1,00,116/- విరాళం

కొత్తకోట, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి కొత్తకోట మం' వాస్తవ్యులు అద్విక్ సాగర్ జ్ఞాపకార్థం వారి కుటుంభ సభ్యులు పోతులపల్లి జయమ్మ పోతులపల్లి శ్రీనివాసులు దంపతులు, వారి కుమారులు పోతులపల్లి కల్పన వినోద్ సాగర్ దంపతులు , పొతులపల్లి సవ్య శ్రీ అనీల్ సాగర్ గారి దంపతులు 1,00,116/- ( ఒక లక్ష నూట పదహారు రూపాయలు )లి విరాళాన్ని ప్రకటించి అయ్యప్ప సేవాసమితి సభ్యులు ధూపం నాగరాజు , పొగాకు అనీల్ కుమార్ , విశ్వనాథం గంగాధర్ , సత్యం సాగర్ , లక్ష్మీ నారాయణ యాదవ్ , భాస్కర్ రెడ్డి , రాజవర్ధన్ రెడ్డి , భీమ కిషోర్ లకు విరాళాన్ని చెక్కు ద్వార అందజేశారు.





మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బార్

## వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని రద్దు చేయాలి

**ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బార్**

**ముస్లింల భారీ నిరసన ర్యాలీ**

కొత్తకోట, ఏప్రిల్ 18 (ప్రభాత ఉదయం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కొత్తకోట మండల కేంద్రంలోని ముస్లిం మత పెద్దలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ని ముస్లిం జేఏసీ, ఆవాజ్ సంఘం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో అన్ని మసీదుల్లో ప్రార్ధనలు చేసిన అనంతరం మక్కా మసీదు నుండి పట్టణ చౌరస్తా వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి. జబ్బార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్ష సాధింపు చర్యతో లౌకిక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఇటువంటి మతోన్మాద చర్యలు చేపడుతుందన్నారు. కేంద్ర చర్యలను లౌకికవాదులు ఖండించాలని కోరారు. బిల్లును ఉపసంహరించుకోకపోతే ముస్లింలంతా ఉద్యమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ముస్లిం జేఏసీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**మంత్రి పొంగులేటి సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

ధరూర్, ఏప్రిల్ 18(ప్రభాత ఉదయం) ధరూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించే భూభారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేయుచున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఏర్పాట్లను పరిశీలించారు. ధరూర్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభ ఏర్పాట్లను పరిశీలించి కలెక్టర్ మాట్లాడుతూ, సభకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సజావుగా చేపట్టాలని, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. టెంటు, మైక్ ఏర్పాట్లతో పాటు మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా గ్యాలరి ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. సభ వద్ద అంతరాయం కలగకుండా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నరు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను విజయవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లింగపల్లి రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం)హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజు ఏదో ఒక మూలన మత్తు పదార్థాలు పోలీసుల రైడులో దొరుకుతూనే ఉన్నాయి. తాజాగా లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో మరోసారి గంజాయి స్మగ్లింగ్ ఘటన చోటు చేసుకుంది. గంజాయి సరఫరాకు రైలు మార్గాన్ని ఎంచుకున్న ముఠా అనుమానిత ప్రవర్తనతో పోలీసులకి చిక్కింది. తనిఖీల్లో భాగంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ఉన్న ఓ బ్యాగుపై అధికారులు దృష్టి సారించారు.ఆ బ్యాగు పరిశీలన చేయగా.. అందులో 13 ప్యాకెట్లుగా ప్యాక్ చేసిన 12 కిలోల గంజాయి ఉన్నట్లు- రైల్వే పోలీసులు గుర్తించారు. ఇది సుమారు రూ. 6 లక్షల విలువచేసే గంజాయిగా అధికారులు తెలిపారు. దీనితో ఇప్పుడు ఈ బ్యాగును ఎవరు ఉంచారన్న కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవలి కాలంలో గంజాయి తరలింపుకు రైలు మార్గం ఎక్కువగా ఉపయోగపడుతోందని పోలీసులు భావిస్తున్నారు. నిన్న (గురువారం) కూడా ఇదే తరహాలో దాధర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న సమయంలో, 12 కిలోల గంజాయితో ఓ వ్యక్తిని పట్టు-కున్నారు. పోలీసుల విచారణలో ఒడిశా రాష్ట్రం భరంపురా నుంచి గంజాయి తరలింపుగా ఈ ఘటనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్ సమీరా బిసోయ్‌ను కూడా జీఆర్‌పీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు- అధికారులు తెలిపారు. ప్రమాదకర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

### రాజేంద్రనగర్ సర్కిల్‌లో

# భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



గుడ్ ఫ్రైడే ఆరాధనలలో పాల్గొన్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్





పాటలు పాడుతున్న యవ్వనస్థులు

బుద్వేల్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం) : గుడ్ ఫ్రైడే సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చర్చీలలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిలువ పై యేసు ప్రభువు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. క్షమాపణ, రక్షణ, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, ప్రేమ, దేవుని వేడుకొనుట, దప్పిగొనుచున్నాను, లేఖనాలు నెరవేర్పు అనంతరం దేవునికి అర్పించు చుకోవడం, సమాప్తమైనది అన్న విషయాలపై బైబిల్లో ఉన్న వాఖ్యాలను వివరించారు. నశించి పోతున్న మానవాళి పాప ప్రాయచ్చిత్తం కోసం 2025 సంవత్సరాలకు పూర్వం యేసు క్రీస్తు నరవతారిగా జన్మించి ముప్పై మూడున్నర సంవత్సరాలు లోకంలో జీవించి ప్రజలకు అనేక మేలులు చేసినప్పటికీ ఆయనను సిలువ వేయగా, సిలువలో పలికిన ఏడు మాటల వల్ల లోకానికి మేలు జరిగిందని గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ మన్నాచర్చిలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, బుద్వేల్ బెతెస్థా మిషన్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ కె.నతానియేల్, అతా బిపూర్ రాక్ చర్చిలో రెవరెండ్ కె. సుందర్ పాల్, ఉప్పరపల్లి హెూరేబు చర్చిలో రెవరెండ్ పి. స్వర్ణ కుమార్, అత్తాపూర్ లో రెవరెండ్ జేపీ పాల్, రెవరెండ్ సామ్యూల్ రాజ్, తేజస్విని కాలనీలోని ట్రినిటీ కాథ్రెడల్ చర్చిలో బిషప్ జోసెఫ్ కిషోర్, దుర్గా నగర్ ఎలోహిమ్ చర్చిలో రెవరెండ్ సీహెచ్ సునీల్ శామ్యూల్, దుర్గానగర్ నాగమల్లయ్యగౌడ్ వెంచర్ లో రెవరెండ్ పాల్ దేవరాజ్ , లక్ష్మీగూడలో రెవరెండ్ జాన్ వెస్లీ , బాబుల్ రెడ్డినగర్ లో రెవరెండ్ డి.ఆనంద్ పాల్ , మధుబన్ కాలనీ భాప్టిస్ట్ చర్చ్ లో రెవరెండ్ విజయ్ కుమార్ , శాస్త్రీపురంలో రెవరెండ్ థామస్ కురియన్, బవానీకాలనీలో రెవరెండ్ ఎ.మనోహరం, ఎర్రబోడలో పాస్టర్ మధు. బుద్వేల్ రైల్వే స్టేషన్ అనంద్ నగర్ లో సిస్టర్ లీనా కుమారి, పాస్టర్ దినకర్, సిస్టర్ లిల్లీ గ్రేస్, ఉడంగడ్డంలో సిస్టర్ పద్మ, పాస్టర్ కొర్నేలీ, శివరాంపల్లిలో పాస్టర్ బట్టు శ్రీకాంత్, సిస్టర్ పద్మ, పాస్టర్ ప్రమోద్ కుమార్, హైదర్ గూడ లో పాస్టర్ సోమారం రాజ్ కుమార్ , లక్ష్మీగూడలో పాస్టర్ మూర్తి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి.

## సోనియా,రాహుల్ చట్టాలకు అతీతులా?

**నేషనల్ హెరాల్డ్ కేసుపై బండి సంజయ్**

హైదరాబాద్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం)భారతదేశ రాజ్యాంగానికి సోనియా, రాహుల్ అతీతులా? చట్టాలు వీరికి ఎందుకు వర్తించకూడదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబం అంటూ మరోమారు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లను లక్ష్యంగా చేసుకొని ఆయన విమర్శల వర్షం కురిపించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను దోచుకునేందుకు యంగ్ ఇండియా సంస్థ పేరుతో 50 వేల కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న కుట్రలో ఈ కుటుంబం మునిగిపోయిందని ఆరోపించారు. ఇదంతా యూపీఏ హయాంలోనే బయటపడిందని, నిందితులు అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకున్నారని చెప్పారు. ఇందులో మోదీ, బీజేపీ పాత్ర ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు.నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్లో మీకు వాటా ఉందని నమ్మితే, ధర్నా చేయాల్సింది -టె-న్ జనపథ్ (సోనియా ఇంటి ముందు) అని కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పు చేస్తే ఎవరు అయినా జైలుకెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణలో వక్ఫ్ ఆస్తులపై జరుగుతున్న రాజకీయాల పట్ల బండి సంజయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒవైసీ కుటుంబం వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకొని లబ్ధి పొందుతుండగా, పేద ముస్లింలకు ఏ ప్రయోజనం లేదని విమర్శించారు. ఆలయాలు, గురుద్వారా, క్రైస్తవ మత్సకారుల భూములపై కూడా వక్ఫ్ పేరు చెప్పి దోచుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ చేస్తున్న ఆందోళనకు రేవంత్ ఆర్థికంగా సహకరిస్తున్నారంటూ సంచలన ఆరోపణ చేశారు. ఈ పరిణామాలను అడ్డుకోకపోతే తలెత్తే సమస్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఒవైసీ నిర్వహించబోయే సభ కాంగ్రెస్ స్పాన్సర్డ్ ప్రోగ్రామేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఎంఐఎంకు దూరంగా ఉండాలని చెబుతుండగా, వాస్తవంలో కాంగ్రెస్-ఎంఐఎం మధ్య గాఢమైన సహకారం ఉందని అన్నారు. లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు వ్యతిరేకంగా ఓటేసి కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.



అత్తాపూర్ చింత కుంట పార్కులో పక్షులకు నీరు అందించడానికి ఏర్పాటు చేస్తున్న వాటర్ పాట్ లతో మార్నింగ్ వాకర్స్

## మూగ జీవాలను ఆదుకోండి: జస్టిస్ లక్ష్మణ్

బుద్వేల్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం) : మండే ఎండలు, కసిరే కాలంలో పిట్టలకు, ఇతర మూగ జీవాలకు చల్లని నీటిని అందించే కార్యక్రమానికి అత్తాపూర్ డివిజన్ చింతకుంట పార్కు వాకర్స్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం జస్టిస్ ఎం. లక్ష్మణ్ శ్రీకారం ప్రారంబించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండాకాలంలో పక్షులు, ఇతర ప్రాణుల దాహార్తిని తీర్చడానికి వాకర్స్ స్వచ్ఛందంగా నీటి తొట్టిలు, వాటర్ పాట్స్, ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ వంటి స్పూర్తిదాయకమైన కార్యక్రమాలకు పౌర సమాజం సహకరించాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త, పక్షి, జంతు ప్రేమికులు మ్యాడం మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సృష్టిలో మానవునితో పాటు అన్ని జంతువలకు చోటు ఉండాలన్నారు. ప్రతి జంతువు మానవులకు ఉపయోగపడేవిధంగా ఉంటాయన్నారు. ప్రజా సంఘాల ప్రతనిధులు. వాకర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు నల్లింగ్ రమేశ్, సుబ్బరాజు, జైతారం జగన్మోహన్ రెడ్డి , నర్సిం హులు, బీట్కూరి సతీష్, సురేందర్, మల్లేశ్, ఎం.సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.



పార్కు లో నీటి తొట్టి ఏర్పాటు



## హరే కృష్ణ బలరామ మందిర నిర్మాణం చేసి తీరతాం

**బురదజల్లే ప్రయత్నం చేసినా న్యాయమే గెలిచింది.**

**వెల్లడించిన సిస్కో ఇన్ఫ్రా డెవలపర్స్ సంస్థ**

**శ్రీ కృష్ణ బలరాం టౌన్ షిప్ నిర్వాహకులు**

చెన్నూర్, ఏప్రిల్ 18. (ప్రభాత ఉదయం) : సరిగ్గా 2 నెలల క్రితం భీమారం మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న హరే కృష్ణ బలరామ మందిర నిర్మాణాన్ని అడ్డుకునే లక్ష్యంగా భీమారం పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన కేసును చెన్నూరు కోర్టు విచారణ అనంతరం కొట్టివేసినట్లు సిస్కో ఇన్ఫ్రా డెవలపర్స్ %ఽ% శ్రీ కృష్ణ బలరాం టౌన్ షిప్ నిర్వాహకులు ప్రకటించారు. హరే కృష్ణ బలరామ మందిర నిర్మాణమే లక్ష్యంగా చేసుకొని జడ్జి గారి తోటలో తాము ఏర్పాటు చేయనున్న 85 ఎకరాల వెంచర్లో 5 ఎకరాల స్థలంలో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, రాష్ట్రంలో ఎక్కడా కానరాని విధంగా అద్భుతమైన ఆలయ నిర్మాణం చేసి తీరతామని వారు తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం కోసమే కొంతమంది తమ వెంచరు పై తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ, తమ కస్టమర్లకు న్యాయమైన ఫ్లాట్ల అమ్మకాలు చేయాలనే మా సంకల్పమే నేడు తమను నిలబెట్టిందని వారు హర్షం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా తమపై అసత్య ఆరోపణలు ఎదురైనప్పటికీ మా పైన మా కస్టమర్లు, ఏజెంట్లు నమ్మకం కోల్పోలేదని, వారి నమ్మకమే తమకు బలాన్ని ఇచ్చి నేడు మమ్మల్ని విజయం దిశగా నడిపించి, ఆలయ నిర్మాణం చేపట్టడానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేశాయని వెంచర్ నిర్వాహకులు పేర్కొన్నారు. కొద్ది రోజుల్లోనే ఆలయ నిర్మాణాన్ని అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో పూర్తి చేస్తామని అలాగే డి.టి.సి. %జూఆ% అనుమతులతో వెంచర్ యొక్క అభివృద్ధి పనులు చేస్తామని తెలుపుతూ అంతవరకూ ఆలయ నిర్మాణంపై వస్తున్న అపోహలు వీడి హరే కృష్ణ బలరామ మందిర నిర్మాణానికి తమకు సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## గచ్చిబౌలి భూ అక్రమాలపై విచారణ చేయించండి: కెటిఆర్

హైదరాబాద్, ఏప్రిల్18(ప్రభాత ఉదయం) కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిదని కెటిఆర్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ కి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ప్రధానిని ఆయన కోరారు. కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. దీనిపై ప్రధాని వ్యాఖ్యలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసం. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా తెలిపాం. స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని కేటీఆర్ కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608